కథానిక

# కోరుకున్న బానిసత్వం

"జ్యేష్ఠ"

కళ్ళు తెరిచాను. గది చీకటిగా ఉంది. బద్ధకంగా లేచి తలుపుతీశాను. గుమ్మంమీద కవరుంచి వెళ్ళిన పోస్టుమాన్ కదంతొక్కుతూ కనిపించాడు. అతనూ, అతని ఖాకీ యూనిఫారం. దాన్ని చూసుకుని మురిసిపోయి అతను చేసే హంగామా...ఇవన్నీ మనస్సులో వరసగా మసలగా నిద్రాభంగం చేసినందుకు అతన్ని విసుక్కోవడం మరిచిపోయాను. అతనింకా కుర్రాడు; కనుకనే ఒకమారు కేకవేసి కవరక్కడుంచి నిష్క్రమించాడు. అదే అనుభవజ్ఞుడైన పోస్టుమాన్ అయితే స్వయంగా చేతికిచ్చి ఉండును.

మద్రాసునుంచి వచ్చిందా కవరు. మద్రాసులో ఎవరున్నారు? శారద ఉందేమో! శారదను చూసి ఆరుసంవత్సరాలయింది అనుకుంటూ కవరువిప్పాను. నళిని వ్రాసింది. నళినికి మద్రాసు ట్రాన్స్‌ఫర్ అయిందిట.

"శశీ!

ప్రయాణసన్నాహాల హడావుడిలో ట్రాన్స్‌ఫర్ అయినట్లు వ్రాయడానికి వీల్లేకపోయింది. అన్నీ నేనే చూసుకోవాలిగదా! అందుకని ఇక్కడకు రాగానే వ్రాస్తున్నాను. ట్రెయిన్లో ఒక అనుకోని సంఘటన జరిగింది."—ఏ అభాగ్యుడో నళినికి మారేజి ప్రొపోజల్ చేసి సగౌరవంగా ఉపసంహరించుకుని ఉండాలి అనుకుని చదవడం మొదలుపెట్టాను.

"శారద సకుటుంబంగా సాక్షాత్కరించింది! వాళ్ళాయనకు రాజమండ్రి ట్రాన్స్‌ఫర్ అయిందట. శారద ఎంత మారిపోయిందనుకున్నావ్! పునర్జన్మ ఎత్తినట్టు కనిపిస్తోంది. శారదను చూసి ఎవరూ బి. ఏ. చదివిందనుకోరు. నేతచీర, కుంకుమ బొట్టు, డజను గాజులు, మెళ్లో గొలుసులు, ముక్కుకి చెవులకి—వాట్ల పేర్లు తెలియవు—అవీ, మామూలు చెప్పులు. ఇదీ శారద అవతారం. ఈ వేషంలో శారదను గుర్తుపట్టలేకపోయాను. అంతా సంసార తాపత్రయం. చదువుకు పూర్తిగా పించను ఇచ్చినట్టు కనిపిస్తోంది.

కాని శారద ఏం విచారిస్తున్నట్టు కనపడదు. నాకుమటుకు ఏడవలేక నవ్వుతున్నట్టు తోస్తోంది. వెనకాల నా ఎడ్రస్ ఇచ్చాను. జాబులు వ్రాస్తూ ఉండు. శారద మీ ఇంటికి దగ్గర్లోనే ఉంటోందిట.

నళిని."

అనుకున్నంతా అయింది! ఆనాడు ఆ పెళ్ళి వద్దని నేను, నళిని ఎంతో బోధించాం. శారద మొగుడు చదుకున్నవాడే...బాగా చదువుకున్నవాడే. అయితేనేం? ఒక్క నవనాగరికతా లక్షణం లేదతనిలో. అతను కర్ణాటక సంగీతం అంటే చెవికోసుకుంటాడుట. రోజూ దేవుడికి పూజచేస్తాడట. క్లబ్బులకీ వాటికీ వెళ్ళడుట. ఇంగ్లీషు పత్రికలు ఇష్టంగా చదవడుట. స్త్రీ సరికొత్త పద్ధతిలో అలంకరించుకుని కనిపిస్తే తేళ్ళూ జెర్రులూ పాకుతున్నట్టు కలవరపడి మెలికలు తిరిగిపోతాడుట. ఇంకా ఏవేవో చేస్తాడుట. అన్నివిధాలా శారదకు తగని వరుడు.

శారదకి ముందే హెచ్చరించాం "ఈ పెళ్ళి నీ ఆశయాల అధఃపతనానికి నాందిసుమా!" అని. శారద ఏమీ భయపడలేదు. "చేతనైతే ఆయనను నీ పద్ధతులకి అనుకూలంగా తిప్పుకో" అన్నాం చివరకు. శారద చిరునవ్వు నవ్వింది.

శారద, నేను, నళిని మా ఆశయాలకు తగిన వ్యక్తులు దొరికేదాకా పెళ్ళాడమని ప్రతిజ్ఞలాంటిది చేసుకున్నాం. కాని శారద బి. ఏ. అవగానే పెళ్ళాడేసింది. తను తొందరగా పెళ్ళాడకపోతే కొంపలంటుకు పోతాయనుకొంది కాబోలు!

ఇప్పుడేమనుకొని ఏంలాభం? పెళ్ళయాక శారదా, భర్తా ఎక్కడికి ఎగిరిపోయారో పిట్టైనా తెలియదు. ఆరేళ్ళకి పునర్దర్శనమైంది. శారద,

భర్త, ఇద్దరు పిల్లలు. చిన్న సంసారం ఇన్నాళ్ళకి కనపడింది; అదే మహాద్భాగ్యం.

*   *   *

...పాపం! దురదృష్టవంతురాలు. భర్త ఎంత నియంతృత్వం చెలాయిస్తే అలా మారిపోయిందో! భర్త తన అలవాట్లు ఒకటొకటే మార్చేస్తూంటే అసహాయంగా కన్నీళ్ళతో ఆమె గడిపిన నిద్రలేని రాత్రులు...తన పూర్వజీవితాన్ని తలుచుకుని ఆమె పడే వేదన. ఆమె యౌవనపు ఆదర్శాల రోదన. ఎంతనికృష్టం శారద జీవితం! గులాబిపువ్వు కోయబోతే ముల్లుగుచ్చుకున్న బాధ లభించింది. దాహం తీర్చుకోబోతే ఉప్పునీళ్ళు దొరికాయి. పాడు సంసారపు పాత అద్దం చూపేది శారద పూర్వపు రూపాన్ని కాదు—భర్త అధికారంలో ఆశయాల చిగుళ్లు ఎండిపోగా మిగిలిన మోడుని. నన్ను చూసి తన కళాశాల జీవితం గుర్తుకిరాగా ఎంతబాధ పడుతుందో—అనుకుంటూ నళిని ఇచ్చిన నెంబరు గల ఇంటిముందు ఆగాను.

కటకటాలలోపల అయిదేళ్ళ కుర్రాడు ఊయెల ఊపుతున్నాడు. అందులో రెండేళ్ళపాప నిద్రపోతోంది. నన్ను చూసి తల్లిని పిలిచాడు కుర్రాడు. "అమ్మా! ఎవరో వచ్చింది" అని తలుపుతీశాడు. శారద నన్ను చూస్తూనే పరుగెత్తుకొచ్చి కావిలించేసుకుంది. కుశలప్రశ్నలూ అవీ యథాప్రకారం జరిగాయి.

"ఇంకా నువ్వు మారలేదన్నమాట!" శారద అంది నా అవతారం చూసి. అందులో బాధ స్పష్టంగా కనిపిస్తోంది. తన పూర్వరూపం గుర్తొచ్చి ఉంటుంది. "నన్ను చూసేనా బుద్ధి తెచ్చుకుంటావనుకున్నాను. ఇంకా చిన్నతనమే?" అంది. "లాభంలేదు. శారద అంధకారంలో పూర్తిగా మునిగిపోయింది!" అనుకున్నాను. కాని నాలో కొద్దిగా కలవరం రేగింది. శారదమార్గమే మంచిదేమో! లేకపోతే అంత నిశ్చలంగా ఎలా ఉంది శారద? అదంతా ఆత్మవంచన అనుకున్నాను. శారద మొగుడు కుర్రవాడిని తీసుకుని షికారు వెళ్ళాడు.

నిద్రపోతున్న చంటిపాపని చూస్తున్నాం శారదా, నేనూ. పాప బోసినవ్వులు నవ్వుతోంది మధ్య మధ్య శారద ఆ నిద్దట్లోవున్న పాప మీద ముద్దులు కురిపించేసింది. "పెళ్ళి చేసుకోకపోతే ఈలాటి నవ్వులేలా వస్తాయే?" అని అడిగింది. "పెళ్ళి చేసుకోకూడదని నేను మాత్రం అన్నానా? తగినవాడు దొరికేవరకు వేచి ఉండాలన్నాను" అన్నాను.

"ఏం మావారు నాకు తగినవారు కారంటావా?" శారద నవ్వుతూ అడిగింది. "ఎంత తగినవారో నీ రూపం చూస్తే తెలుస్తూంది" అన్నాను కసిగా. "ఏం నాలో ఏం మార్పొచ్చింది?" శారద తనని చూసుకుంది ముసిముసి నవ్వులతో. శారద బుగలకి సొట్టలు పడ్డాయి. శారదను మొదటిసారి పదహారోఏట చూశాను. అప్పుడు నవ్వినా ఆమె బుగ్గలకి అచ్చంగా అలాగే సొట్టలు పడేవి.

"నాలో మార్పంటే నా వేషంలో మార్పని కదూ!" అంది చివరకు. "అవును. ఏమిటా వేషం? అసహ్యంవేస్తూను!" అన్నాను. "మావారికి ఈ రూపంలో నన్ను చూస్తే ఎంతో సంతోషం; అందుకని అలా మారిపోయాను." శారద ఉన్నమాట చెప్పేసింది. "నీ దుస్తులమీద మీవారి అధికారమేమిటి?" నేనడిగాను.

"మావారు నన్నేనాడూ 'నీ వేషం ఇలా ఉండాలి' అని శాసించలేదు. నేనే వారి అభిరుచి గ్రహించి—"

"అదిమాత్రం బానిసత్వం కాదుగాబోలు!" అన్నాను. "శశీ, మనం అందంగా ఉండాలని ఎందుకనుకుంటాం?" "ఎందుకేమిటి? మన ఆనందం కోసం; మన సంతృప్తికోసం." "ఇతరుల దృష్టిలో అందంగా ఉండాలనే కదా ఈ అలంకారాలన్నీని! ఇంట్లో ఉన్నప్పుడుకూడా శిల్కు డ్రెస్ వేస్తావా? ఈ పేడర్లూ, లిప్‌స్టిక్‌లూ, ఏనాడూ అవసరం రాని హాండ్‌బాగ్‌లూ ఇవన్నీ పైవారి మెప్పుకోసంకాదూ?" శారద అడిగింది. నేను ఒప్పుకున్నాను.

"దాన్నే బానిసత్వ మనుకుంటే ఎలా?"

"............"

"ఒకరికి తృప్తి కలిగించడంలో ఆనందంలేదూ?"

"............"

"పోనీ భారతీయాలంకరణలో సౌందర్యం లేదని నీవనగలవా?" శారద అడిగింది. ఎలా అనగలను. "ఉహుఁ" అన్నాను.

"మావారు నాకు కనివిప్పు కలిగించారు ఈ విషయంలో." శారద సగర్వంగా అంది.

"ఒకప్పుడు ఇంగ్లీషు పత్రికలు మాత్రమే చదివే దాన్ని. ఇప్పుడు సాంగత్యదోషంవల్ల తెలుగువీ చదువుతున్నాను. మావారిచేత నా కిష్టంలేదు కదా అని తెలుగు పత్రికలు చదవడం మానిపించనా? అది మాత్రం అధికారం కాదా! తెలుగు పత్రికలు చదవడంలో దోషం ఏమిటి?" శారద అడిగింది.

"నీకు తెలియదేమిటి? బి. ఏ. చదివేటప్పుడు ఎందుకు చదివేదానివి కాదూ?" "వాటిలో మాధుర్యం గుర్తించక" అంది శారద. "ఆనాడు చదవలేదు కదా అని ఈనాడూ చదవననడం ఆదర్శాలను నిలపెట్టుకోవడం కాబోలు."

"కర్ణాటక సంగీతం అంటే నీ కిష్టం కాబోలు?" గ్రామఫోను రికార్డులు చూస్తూఅన్నాను. "అవును చాలా ఇష్టం" అంది శారద. "ఇష్టమా?" లేక మీ వారికి ఇష్టమని—" అన్నాను. "మనం కర్ణాటక సంగీతం తలనొప్పికి దగ్గరమార్గం అనే దురుద్దేశంలో ఉండేవాళ్ళం. అది చెడ్డదని మనం అనుకున్నన్నాళ్ళూ కర్ణకఠోరంగానే ఉంటుంది. కాని మావారు—" అంది శారద. 'ఇది—అంటే నీలో మార్పు నీ మెదడు ఆపరేషన్‌తో తీసివేసి మీవారి మెదడు కోసి అక్కడ ఉంచడం లాంటిది. తెలుసా?"అన్నాను. "ఆ మార్పు బలవంతంగా జరిగే ఆపరేషన్ అనుకోవచ్చు. కాని అది సహజమైనది. దానివల్ల బాధేమీలేదు." అంది శారద. "ఇష్టంలేని పనిని ఒకరికి భయపడి చేస్తే అది బానిసత్వం. నేను వారి పద్ధతులు మంచివని తోచే స్వీకరించాను: భయపడికాదు. మార్పు మన మంచికే వచ్చినప్పుడు పూర్వం ఎలా ఉంటేనేం? కొందరు మూర్ఖంగా పాత పద్ధతులకే అంటిపెట్టుకొని తాము బాధపడి, భర్తనుకూడా శాయశక్తులా బాధపెట్టి గృహాన్ని నరకానికి వీలైనంత చేరువగా లాక్కుపోతారు.

"వారు నన్ను శాసించలేదు. అధికారం చెలాయిస్తే నేను తిరగబడేదాన్నేమో! నాకు అసహ్యమని తెలిసి వారు అత్యంత ప్రియమైన పేకాట మానివేశారు. వారు దేవుడికి రోజూ పూజ చేస్తారు. నేను చెయ్యను. నా తరఫున కూడా వారే చేస్తారు."

"వీలైతే వారిచేతకూడా పూజ మానిపించాలి" అన్నాను. "నీకింకా తల తిక్క పోలేదు. వారి పూజమీద నా అధికారమేమిటి? వారి మనశ్శాంతికి వారు చేసుకుంటారు." అంది శారద.

"నా దృష్టిలో నాసంసారం స్వర్గం. నా పద్ధతి బానిసత్వంగా నీవనుకోవచ్చు. కాని నా దృష్టిలో నేను స్వేచ్ఛా జీవిని."

ఆమెది స్వేచ్ఛా? బానిసత్వమా? ఇప్పటికీ నాకు తెలియలేదు.

---

తానొక స్వతంత్రమైన వ్యక్తిత్వంతో వికసించాలని ! ప్రతి మనిషికీ కోర్కె ఉండడం సహజమనే అమలులోనున్న నమ్మకంలో అంతగా నిజంలేదు. ఆర్థిక వ్యవస్థయొక్క కారణాలవల్లనైతేనేం, పుట్టిపెరిగిన వాతావరణపు మనస్తత్వాలకు దాసులైనందువల్లనేం, సమాజంలో అత్యధిక వ్యక్తులు "నలుగురితోపాటు నారాయణా" అనే పద్ధతిలోనే ప్రవర్తిస్తారు, అనామకంగా జీవించడంలోనే సుఖం పొందుతారు, నిత్యనైమిత్తికమైన పనులు చెయ్యడంతోనే సంతృప్తి పడతారు, ఆ రకం మనుషులు కోరుకునేదల్లా గొర్రెల మందలో ఒక గొర్రెగా, సేనానాయకుడిక్రింద మామూలు సైనికుడిగా, మేస్త్రీకింద పనిచేసే బానిసగా—కాలక్షేపం చెయ్యనిస్తే చాలునని. అలా కాక, "వికసించాలని" తహతహలాడే వాళ్ళు యీరకం గొర్రెలమందకు యజమానిగానూ, సైన్యానికి అధికారిగాను, బానిసలగుంపుకి మేస్త్రీగానూ పెత్తనం చెలాయిస్తారు.

—(బ్రిటిష్ మేధావి హెర్బర్ట్ రీడ్)